క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

కందుకూరు రూరల్: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2022–2023 ఆర్థిక సంవత్సరానికి జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ ఎల్.సుజాత తెలిపారు. మండలంలోని ఉపాధి కూలీలు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పాల్గొనాలని కోరారు.

ఎస్సైగా ఆనందభాస్కర్ బాధ్యతల స్వీకరణ

కందుకూరు: కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా నియమితులైన ఆనందభాస్కర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నిన్నటి వరకు పట్టణ ఎస్సైగా విధులు నిర్వర్తించిన హనీఫ్‌ని ఉన్నతాధికారులు ఇక్కడి నుంచి బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూతన ఎస్సై ఆనందభాస్కర్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన స్థానిక స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

జరుగుమల్లి: ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా జాళ్లపాలెం గ్రామంలో బుధవారం ఉదయం పోలేరమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈటలు బొర్రా కొండారెడ్డి, రావెళ్ల శివశంకర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పైడిపాడులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రేష్మి

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని కామేపల్లి సీహెచ్‌సీ వైద్యాధికారి జి.రేష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని పైడిపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 56 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో బాలికలకు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో కలిగే నష్టాలు, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళం

కందుకూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనానికి కోవూరు గ్రామ సర్పంచ్ ఆవుల మాధవరావు రూ.28,216 విరాళం అందించారు. కమిటీ సభ్యులు నల్లబోతుల మురళి, కాటా చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు


దప్పళంపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న విమల ప్రియదర్శిని

గుడ్లూరు: మండలంలోని దప్పళంపాడులో యునాని వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.యునాని డాక్టర్ విమల ప్రియదర్శిని 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందచేశారు. ఏఎన్ఎం శ్రీలత, ఎంఎల్‌హెచ్‌పీ హర్షిత, లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ


పుస్తక సామాగ్రి పంపిణీ చేస్తున్న మాల్యాద్రి, ఎంఈఓలు

కందుకూరు రూరల్: మండలంలోని కొండికందుకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, ప్రస్తుతం కావలి జవహర్ భారతి కళాశాల ప్రిన్సిపాల్ రాయి మాల్యాద్రి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.50,000 బ్యాంకులో డిపాజిట్ చేశారు. వచ్చే వడ్డీతో ఏటా రిపబ్లిక్‌డే దినోత్సవం రోజు పాఠశాల విద్యార్థులకు అవసరమైన పుస్తక సామగ్రిని అందజేస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పుస్తక సామాగ్రిని ఎంఈఓ ప్రసాద్, సుబ్బారెడ్డి, మాల్యాద్రిలు పంపిణీ చేశారు. సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం


గుడ్లూరులో ఆసరా చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి


ఉలవపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి
- రూ.8.17 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ

గుడ్లూరు: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో వారికి అగ్రస్థానం కల్పించారని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే పొదుపు సంఘాల మహిళలకు ఆసరా చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక సమయంలో మహిళలకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో వారికి సంపూర్ణంగా రుణమాఫీ చేసి వారు ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవనోపాధులు పెంచుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్న దేశ చరిత్రలోనే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో 1033 గ్రూపులకు చెందిన 10177 మంది మహిళలకు రూ 8.17 కోట్లు ఆసరా కింద వారి బ్యాంకు ఖాతాలలో జమైందన్నారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు వ్యాపార రంగంలో రాణించడానికి వారికి అవసరమైన శిక్షణను మండల స్థాయిలో ఇచ్చి మార్కెటింగ్, ఉత్పత్తుల తయారీలపై మెళకువలు నేర్పిస్తామన్నారు. రుణాల రికవరీలో గుడ్లూరు మండలం 98 శాతంతో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందిచేశారు. అలాగే 39 గ్రూపులకు రూ 5.92 కోట్లు బ్యాంకు లింకేజీ చెక్కులు అందచేశారు. 240 స్వయం సంఘాల గ్రూపులకు రూ 6.12 కోట్లు స్త్రీ నిధి చెక్కును అందచేశారు. కార్యక్రమానికి భారీగా మహిళలు హాజరయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్యే, పీడీలు అంగన్‌వాడీ, ప్రకృతి వ్యవసాయశాఖ, వైద్యశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, ఎంపీడీఓ రాజశేఖరరావు, సర్పంచ్ శంకర్, క్రిష్ణ బలిజ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మరియమ్మ, ఏపీఎం అశోక్, ఎంఈఓ-2 గోవర్ధన్, వైస్ ఎంపీపీ వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలాంబరి, వైద్యాధికారి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: పేదలు ఎవరిపై ఆధారపడకుండా వాళ్ల కాళ్లపై వారు నిలబడేలా సీఎం సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీలో ఆయన మాట్లాడారు. మహిళలు ఎదిగితే సమాజం ఎదుగుతుందని నమ్మి వారి కి అండగా గ్రూపు సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం ఆసరా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.25 వేల కోట్లు మహిళల ఖాతాలో జమచేశారని తెలిపారు. బ్యాంకులు సైతం మహిళలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. ఉలవపాడు మండలం నియోజకవర్గంలోనే ప్రథమ స్థానం సాధించి నూటికి నూరు శాతం రికవరీ సాధించడం మంచి పరిణామమన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు


గుడ్లూరులో ఆసరాలో పోటెత్తిన మహిళలు

నేను మంచి చేస్తేనే నాకు ఓటు వేయండి, మీ కుటుంబాలకు మంచి జరగకపోతే నాకు ఓటు వేయవద్దని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఆసరా నగదు దుర్వినియోగం చేయవద్దన్నారు. ముందుగా ముఖ్యమంత్రి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెక్కులు అందజేశారు. మండల సమాఖ్య ద్వారా తయారు చేసిన రోటీ, పరోట, పుల్కా, చపాతి ప్యాకెట్లను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. ఎంపీపీ మస్తానమ్మ, జెడ్పీటీసీ అరుణ, వైస్ ఎంపీపీలు రమణయ్య, ఫజుల్, మండల కోఆప్షన్ సభ్యులు ఖాదర్‌భాషా సర్పంచ్‌లు నాగలక్ష్మి, లతా చంద్రశేఖర్ ఉన్నారు.


మున్సిపల్ పాలక వర్గంతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

సమష్టిగా పనిచేద్దాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమష్టి ప్రణాళికగా పనిచేద్దాం.. కనిగిరిలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం దద్దాల నారాయణయాదవ్ మున్సిపల్ పాలక పక్షాన్ని కలిశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణను చైర్మన అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులి శాంతి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ మనమంతా సమన్వయంతో పనిచేసి, ప్రతి వార్డులో వైఎస్సార్ సీపీకి మెజార్టీ వచ్చేలా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ఫ్యాను గుర్తుకు ఓటు వేసే విధంగా చైతన్య వంతులను చేయాలని కోరారు. తనను ఆశీర్వదించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేయాలని పిలుపునిచ్చారు. అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు తామంతా కష్టపడి పనిచేస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, తమ్మినేని సుజాత, జాస్మిన్, కరీమున్నిసా, పులి విజయలక్ష్మి, పెన్నా నాగమ్మ, దేవకి సత్యావతి, మాధవి, పసుపులేటి దీప, సాహెరా బాను, ఖాజా, శ్రీరాం సతీష్, దేవకి రాజీవ్, దేవ రాజ్, జి. అబ్రహం లింకన్ , దాసరి మురళీ, చింతం శ్రీనివాసులు, కటికల వెంకట రత్నం, గురుప్రసాద్, మూలె గోపాల్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, సిరుపగోవర్ధన్‌రెడ్డి, యక్కంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- ఎంపీడీఓ జలజాక్షి


హౌసింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

జరుగుమల్లి: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ జలజాక్షి సూచించారు. జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న గృహ నిర్మాణాలు, జగనన్న పాలవెల్లువ, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో 601 గృహనిర్మాణాలు లక్ష్యం కాగా 411 గృహాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయని కార్యదర్శులు వివరించారు. 145 గృహాలు పూర్తయ్యాయని, 115 గృహాలు బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయని చెప్పారు. జగనన్న పాలవెల్లువ సర్వేను వలంటీర్లతో పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు. జగనన్నకు చెబుదాం అర్జీలను వెంటనే పరిష్కరించాలని 15 సచివాలయాల పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ ఆదేశించారు. జేకేసీ ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సింగ్, మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నిజం గెలవాలి పేరుతో అబద్ధపు యాత్ర

- ఎన్‌టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుదే
- చంద్రబాబు ఒక్క హామీ అమలు చేయలేదు.. జగన్ 99శాతం హామీలను పూర్తి చేశారు
- నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల రామారావు

కందుకూరు: ఎన్‌టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి, అబద్ధపు హామీలు, మోసాలతో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన చంద్రబాబునాయుడుకు మద్దతుగా నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి చేస్తున్న యాత్ర పూర్తిగా ప్రజలను మభ్యపెట్టేందుకేనని వైఎస్ఆర్ సీపీ రాష్ట బీసీ విభాగం జోన్-5 ఇన్‌చార్జి బొట్ల రామారావు విమర్శించారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 119 హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. 151 సీట్లు గెలిచి రాష్ట్రాన్ని ముందంజలో నడుపుతున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి, రూ.2.50 లక్షల కోట్లు డీబీటీ ద్వారా పేదలకు పంచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది అయితే చంద్రబాబు నీరు-చెట్టు, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. ఇటువంటి నిజాలను దాచి నేడు సానుభూతి కోసం భువనేశ్వరి నిజం గెలవాలంటూ యాత్ర చేస్తున్నారని విమర్శించారు. రాజకీయాలతో సంబంధం లేని భువనేశ్వరి ఇప్పుడెందుకు రాజకీయం చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రజల్లో సానుభూతి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఎన్‌టీఆర్ పేరు ఒక జిల్లాకు పెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, కానీ ఎన్‌టీఆర్ ఆశయాలను తుంగలో తొక్కిన వ్యక్తి చంద్రబాబు కాదా అని దీన్ని నారా భువనేశ్వరి గుర్తించాలన్నారు. చంద్రబాబు ధనిక వర్గాలకు పెద్దపీట వేస్తే నేడు బీసీలకు జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన ఇన్ని మోసాలను దాచిపెట్టి నిజం గెలవాలని యాత్ర చేయడం సరికాదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ప్రత్యేక హోదా కోసం అనేక ఉద్యమాలు చేయడంతో ప్రస్తుతం, ముఖ్యమంత్రిగా ఉండి నిరంతరం హోదా కోసం పోరాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి సాధిస్తున్నారని చెప్పారు. విభజన హామీలను అమలు కోసం కేంద్రంతో ముఖ్యమంత్రి పలు దఫాలు చర్చలు జరిపారని, హామీల అమలు కోసం రాజీలేని పోరాటం చేస్తున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు.చంద్రబాబునాయుడిలా దొంగ దీక్షలు చేయలేదని,హోదానుతాకట్టుపెట్టలేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సూరం చిరంజీవి రెడ్డి, సుబ్బారెడ్డి, వేణు, ప్రకాశరావు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి


జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి దాతల సహకారంతో కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. కళాశాలను బుధవారం ఆయన పరిశీలించారు. నాడు నేడు పనులు ఎలా జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ జిలానీబాషాను అడిగి తెలుసుకున్నారు. దాతల నిధులతో నిర్మించనున్న డిజిటల్ రూంకు సంబంధించి ప్లాన్‌ను గురువారం అధికారులు వచ్చి పరిశీలించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ఎలా జరుగుతుందో అడిగారు. అదనంగా నిధులు కావాలంటే తెలియచేయాలన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని తెలియచేశారు. కళాశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సీఐ నఫీజ్ భాషా,ఎస్సై బాజిరెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేద్దాం

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పాల్గొన్న కౌన్సిలర్లు

కనిగిరి రూరల్: మనమంతా ప్రణాళికాబద్ధంగా పని చేసి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం బుధవారం స్థానిక సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పాలకవర్గం, అధికారులంతా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌తో పాటు, 2024 సంవత్సర ఆదాయం, వ్యయాల బడ్జెట్‌ను ఆమోదించినట్లు చెప్పారు. గత బడ్జెట్‌లో ఆదాయం రూ.14.00 కోట్లు ఉండగా, రానున్న సంవత్సరంలో ఆదాయం రూ.15.32 కోట్లు రావచ్చని తెలిపారు.

సమావేశంలో సభ్యుల నిరసన

సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ దేవకి రాజీవ్ మాట్లాడుతూ మున్సిపల్ బడ్జెట్ సమావేశ అజెండా కాపీ ఒక్క పూట ముందు ఇచ్చి బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తారా.. ఇది ఎంతవరకు సమంజసమని తీవ్రంగా ధ్వజమెత్తారు. వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా ఇలానే చేశారు.. అప్పుడు అడిగితే ఈ సారి అలా జరగదన్నారు... మరలా ఇప్పుడు కూడా ఇలా చేశారు.. సభ్యులంటే మీకు లెక్కలేదా అంటూ తీవ్రంగా మండిపడ్డారు. కనీసం అజెండా తయారు చేసేటప్పుడు సభ్యులకు చెప్పరా అంటూ ధ్వజమెత్తారు. కౌన్సిలర్ శ్రీరాం సతీష్ మాట్లాడుతూ మున్సిపల్ అజెండా తయారీలో సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వక పోవడంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. అసలు వార్షిక ఆదాయం ఎంతా.. మిగులు బడ్జెట్ ఎంతా అనేదైనా సభ్యులకై నా క్లారిటీగా వివరించాలన్నారు. అలాగే పలువురు సభ్యులు సమావేశంలో తమ నిరసన గళాన్ని వినిపించారు. దీనిపై మేనేజర్ ప్రసాద్, ఏఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ అకౌంటెంట్ లేని కారణంగా అజెండా అంశాల కాపీ తయారీలో జాప్యం జరిగినట్లు వివరణ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్ మాణిక్యరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, దేవరాజ్, తమ్మినేని సుజాత, పెన్నా నాగమ్మ, పులి విజయలక్ష్మి, చొప్పరపు మాధవి, పసుపులేటి దీప, దేవకి సత్యావతి, ఎస్‌కే కరీమున్, ఎస్‌కే జాస్మిన్, ఎస్‌కే సాహెరా బాబు, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీనివాసులు, జి.అబ్రహం లింకన్, అధికారులు పాల్గొన్నారు.

క్షతగాత్రుని కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఏలియా, దాత రమణయ్య

పామూరు: పామూరు డీవీపాలెం ఇటీవల జరిగిన ప్రమాదంలో బొజ్జ దాసుకు తీవ్రగాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్యం కోసం పలువురు విరాళాలు సేకరించి బుధవారం వారి కుటుంబసభ్యులకు రూ.80 వేలు అందజేశారు. క్షతగాత్రునికి బ్రెయిన్‌కు సర్జరీ అవసరంకాగా మాదిగ ఉద్యోగ సమాఖ్య మండల అధ్యక్షుడు రాచూరి ఏలియా, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు క్షతగాత్రునికి కుటుంబసభ్యులకు ఆర్థికసాయంగా నగదు సేకరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి రూ.10 వేలు, చట్టుమడుగు వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా రమణయ్య రూ.20 వేలు, జొన్నలగడ్డ గోవిందయ్య రూ.5 వేలు, కళాశాల అధ్యాపకులు, పలువురు పార్టీ నాయకులు మొత్తం రూ.80 వేలు సేకరించి అందజేశారు. కోడూరి రామసుబ్బారెడ్డి, పాస్టర్ ఆర్.జోసఫ్, బాబు, జయకుమార్, చిన్న, బాస్కర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


నల్లగండ్లలో కులగణన సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ లలిత


ఉప్పలపాడులో సచివాలయ సిబ్బందితో చర్చిస్తున్న తహసీల్దార్ నాగూర్‌మీరా

హనుమంతునిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేలో పెండింగ్ ఉన్న గ్రామాల్లో సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. మండలంలోని హాజీపురం, నల్లగండ్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో కులగణన సర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. కులగణన సర్వేను ఫిబ్రవరి 4వ తేదీ వరకు పొడిగించారన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈఓఆర్డీ షేక్ షరీఫ్, కార్యదర్శులు రామక్రిష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది. వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): కులగణన పకడ్బందీగా పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, అరివేముల గ్రామాల్లో నిర్వహిస్తున్న కులగణనను ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కులగణన యాప్‌లోని అన్ని అంశాలను పూర్తిస్థాయిలో తెలుసుకుని నమోదుచేయాలన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్‌వోలు పీఎస్ గోళ్ల చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సామాజిక తనిఖీ రికవరీ రూ.80 వేలు


లింగసముద్రంలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

లింగసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పనుల్లో రూ.89,696 రికవరీ చేసినట్లు పీడీ వెంకట్రావు తెలిపారు. పీడీ మాట్లాడుతూ సామాజిక తనిఖీ అధికారులైన డీఆర్పీలు, ఎస్సార్పీలు 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులను తనిఖీలు నిర్వహించి కూలీలను విచారించి గ్రామసభలు నిర్వహించారని చెప్పారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ వెంకయ్య, ఎంపీడీఓ యు.శేషుబాబు, ఏపీఓ సమీర్‌బాషా, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన డ్రైవర్‌కు అభినందనలు

కందుకూరు: కందుకూరు ఆర్టీసీ డిపోలో దాదాపు 27 ఏళ్ల పాటు పాటు డ్రైవర్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన డ్రైవర్ కోసూరి కోటేశ్వరరావు సేవలను డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి కొనియాడారు. స్థానిక డిపోలో జరిగిన అభినందన సభలో కోటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు.